# కర్నూలు । నంద్యాల వార్త

25 జూన్, 2024 మంగళవారం పేజీలు 4


## కలిసి పనిచేద్దాం...ప్రజా సమస్యలను పరిష్కరిద్దాం - ఎమ్మెల్యే కోట్ల

**బేతంచెర్ల ,జూన్ 24, ప్రభాతవార్త:** గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కలిసి పనిచేద్దామని ప్రభుత్వ యంత్రాంగానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సుబ్బారెడ్డినగర్, సంజీవనగర్, హనుమాన్‌నగర్ కాలనీలతోపాటు మండల పరిధిలోని గోరుమానుకొండ, సీతారామాపురం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు పెన్షన్లు, రస్తాలు, నీటి సమస్య, రైళ్ల నిలుపుదల పై ఎమ్మెల్యే దృష్టికి తీసుకునిరావడం జరిగింది. అలాగే మురుగు నీటి కాలువల ఏర్పాటు, రహదారుల ఏర్పాటు, విద్యుత్ సరఫరా గురించి ఎమ్మెల్యే దృష్టికి ఆయా కాలనీల ప్రజలు తీసుకునిరావడం జరిగింది. తన వెంటనే ఉన్న అధికారులకు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించడం జరిగింది. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నందు తహసీల్దార్ ఆర్.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన అధికారుల సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని తమ వరకు బాధితులను రానివ్వద్దని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతోపాటు ప్రభుత్వ యంత్రాంగం కలిసి పనిచేస్తే ప్రజా సమస్యలు పరిష్కరించడం సులభతం మవుతుందని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తే తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపెండేకల్ జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే కోట్ల తనిఖీ చేసి ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగింది. నాణ్యతకు పెద్దపీట వేయాలని లేదంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయా గ్రామాలు, కాలనీల్లో టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘన




స్వాగతం పలికారు. ఆయనతోపాటు టీడీపీ మండల కన్వీనర్ యల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి, భీమేశ్వరరెడ్డి, తిరుమలేష్ చౌదరి, బుగ్గన ప్రభాకర్‌రెడ్డి, ఉన్నం చంద్రశేఖర్, సుధాకర్, శివ, న్యాయవాది భాస్కర్‌రెడ్డి, మోహన్ గౌడ్, రామకృష్ణ, కిష్టయ్య, టైలర్ రాముడు, కౌన్సిలర్లు రామాంజనేయులు, రామగోపాల్, విజయలక్ష్మి, రవీంద్ర నాయక్, అంజి, అశ్వత్, వెంకటరాముడు, పలువురు నాయకులు,పాల్గొన్నారు.

### నంద్యాల లోక్‌సభకు తొలి మహిళా ఎంపీగా..

## చరిత్ర సృష్టించిన.. డా.బైరెడ్డి శబరి

**- పార్లమెంటులో అడుగుపెట్టిన నంద్యాల తొలి మహిళా ఎంపీ డా.బైరెడ్డి శబరి**




**నంద్యాల, జూన్ 24, ప్రభాతవార్త ప్రతినిధిః** సోమవారం న్యూఢిల్లీలోని కొత్తపార్లమెంటు భవనంలో 18వ లోక్‌సభకు ఎన్నికైన ఎంపీలతో ప్రొటెం స్పీకర్ భర్తృహరి ప్రమాణస్వీకారం చేయించారు. నంద్యాల లోక్ సభ నుంచి ఎన్నికైన డా.బైరెడ్డి శబరి ఆ ఈశ్వరుడి సాక్షిగా తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. దేశ చిత్రపటంలో నంద్యాల లోక్‌సభ నియోజకవర్గానికి విశిష్టస్థానం ప్రత్యేక గుర్తింపు వుంది. భారత రాజ్యాంగంలోని కీలకపదవులైన రాష్ట్రపతి, ప్రధానమంత్రి పదవులు చేపట్టిన దేశానికి సేవ చేసిన నంద్యాల లోక్ సభ సభ్యులు నీలం సంజీవరెడ్డి, పివి నరసింహా రావులు. ఐదుసార్లు నంద్యాల లోక్ సభకు ఎంపికై కేంద్ర మంత్రిగా, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాలకు గవర్నర్‌గా, ఎన్నో ఉన్నత పదవులు చేపట్టి సిల్వర్ జూబ్లీ పార్లమెంటరియన్‌గా గుర్తింపు పొందిన పెండెకంటి వెంకట సుబ్బయ్య నంద్యాల ఎంపీగా దేశానికి సేవలు అందించారు. బైరెడ్డి శబరి సేవా కార్యక్రమాలు, కుటుంబ రాజకీయ నేపథ్యం, కర్నూలు, శ్రీశైలం, పాణ్యం, నందికోట్కూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని చెంచు, దళిత కాలనీల్లో ఉచిత మెగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి నిరుపేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించి ఉచితంగా మందులు అందిస్తున్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఉద్యమం చేస్తు నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులుగా పనిచేశారు. ఇటీవల బీజెపికి రాజీనామా చేసి మాజీ ముఖ్య మంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో డా.బైరెడ్డి శబరి, ఆమె తండ్రి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిలు టిడిపిలో చేరారు. డా.బైరెడ్డి శబరి సేవా కార్యక్రమాలు, ఆమె రాజకీయ కుటుంబ నేపద్యాన్ని గుర్తించి టిడిపి అధినేత చంద్రబాబు నంద్యాల పార్లమెంటు అభ్యర్థిగా ఎంపిక చేయగా తన ప్రత్యర్థి సిట్టింగ్ ఎంపీ వైసీపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిపై లక్ష ఓట్లకు పైగా శబరి ఎంపీగా విజయం సాధించారు. టిడిపి పార్లమెంటరీ పార్టీ సభ్యుల సమావేశం నిర్వహించిన టిడిపి అధినేత డా.బైరెడ్డి శబరిని టిడిపి లోక్ సభ డిప్యూటి ఫ్లోర్ లీడర్‌గా ఎంపిక చేసి నంద్యాల ఎంపీ పదవికి ప్రత్యేక స్థానం లోక్ సభలో ఉందని గుర్తుచేశారు. ఢిల్లీలోని పార్ల మెంటు భవనంలో జరిగే లోక్ సభ సభ్యుల పదవీ ప్రమాణస్వీకారానికి నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి వెళ్లి ప్రమాణం చేయడాన్ని శబరి భర్త డా.శివచరణ్‌రెడ్డి, తండ్రి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తల్లి బైరెడ్డి భారతమ్మ, చిన్నాన బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, చెల్లెలు బైరెడ్డి శర్వాణిలు కన్నులారా తిలకించి ఆనంద పరవశితులయ్యారు.

## సంగమేశ్వరంలో పెరుగుతున్న.. కృష్ణాజలాలు..!

**- శ్రీశైల జలాశయం వద్ద స్వల్పంగా పెరుగుతున్న నీటిమట్టం**



**కొత్తపల్లి, జూన్24, ప్రభాతవార్త :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానదిలో నీటిమట్టం పెరుగుతుంది. గత ఏడాది కృష్ణానదికి ఆశించిన వరద జలాలు రాలేదు. అందువల్ల వేసవి ప్రారంభం నుంచే తాగు,సాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ నేపద్యంలో ప్రభుత్వం సాగునీటి వసతి లేని చోట పంటలు వేయవద్దని ప్రభుత్వం రైతులకు సూచించింది. ఈ ఏడాది ముందుగా వర్షాలు కురువడంతో కృష్ణానదికి వరద చేరుతుంది. సోమవారం నాటికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 815 అడుగులకు చేరుకుంది, దాంతో సంగమేశ్వరం గర్భాలయా సమీపంలోకి నీరు చేరింది. మరో 25 అడుగులు పెరిగితే సంగమేశ్వర గర్భాలయం లోకి వరదనీరు వచ్చి చేరుతుంది. కావున వరద జలాలు పెరుగుతుండడంతో సంగమేశ్వరానికి సందర్శకులు పెరుగుతున్నారు.

**సంగమేశ్వరం వద్ద పెరుగుతున్న కృష్ణా జలాలలతో మత్స్యకారులు హర్షం ః**

ఈ ఏడాది ముందుగా వర్షాలు కురువడంతో సంగమేశ్వరం వద్ద కృష్ణానదికి వరద చేరుతుండడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానది తీరగ్రామాలలో ఎక్కువశాతం చేపల వేటే జీవనదారం కొత్తపల్లి మండలంలోని కృష్ణానది తీరాన గ్రామాలలోని దాదాపు 300 మత్స్యకారుల కుటుంబాలు చేపలు పడుతూ జీవనం సాగిస్తారు. కొత్తపల్లి మండలంలోని జానాల గూడెం, బలపాలతిప్ప, పాతమాడుగుల, ఎర్రమఠం, గుమ్మడాపురం కృష్ణానది తీరాన చేపల వేటపై జీవనం సాగిస్తారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం గత ఏడాది నవంబర్ మాసంలోనే అధిక స్థాయిలో తగ్గడంతో ఆయా గ్రామాల తీరాన కృష్ణా జలాలు పూర్తిగా చుక్క నీరు లేకుండా ఎండిపోయాయి. మండలంలోని జానాలగూడెం, బలపాలతిప్ప, కపిలేశ్వరం, పాతమాడుగుల గ్రామాలలోని జనం మొత్తం సంగమేశ్వరం సమీపంలో కూడ కృష్ణాజలాలలో చేపలు పడితేనే భుక్తి లభిస్తుంది. జలాలు తగ్గడంతో సూమారు ఏడు నెలల పాటు బోట్లు ఒడ్డుకే పరిమితమయ్యాయి. దాంతో ఉపాధి లేక మత్స్యకార కుటుంబాలు అల్లాడిపోయారు. ఈ ఏడాది త్వరగా వరద వస్తుండటంలో మత్స్యకారులు చేపలు పట్టే వలలు, పుట్టిలు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.



## శ్రీశైల మల్లన్న దర్శించుకున్న తెలంగాణా ఉపముఖ్యమంత్రి

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్24, ప్రభాతవార్త**

అష్టదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రంను సోమవారంనాడు తెలంగాణా ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క దంపతులు, మరియు మంత్రి జూపల్లి కృష్ణరావు శాసన సభ్యులు వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డిలు శ్రీశైల మల్లన్న దర్శనార్థమై ఆలయం వద్దకు చేరుకున్నారు. వారికి ముందుగా ఆలయ రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఈఓ డి.పెద్దిరాజు, ఏఈఓ హరిదాసు, అర్చకస్వాములు సాదర స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవారి ఉభయ దేవాలయాలను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వారికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ప్రాకార మండపంలో ఈఓ డి.పెద్దిరాజు శ్రీస్వామివారి శేషవస్త్రములతో ఘనంగా సత్కరించి లడ్డు ప్రసాదాలను అందజేసారు. అనంతరం విలేఖర్లతో ఉపముఖ్యమంత్రి మాట్లడుతూ రెండు తెలుగు రాష్ట్రల ప్రజలు సుఖశాంతులుతో ఉండాలని సమృద్ధిగా పాడిపంటలు పండాలని ఆ దేవుని ప్రార్థించడం జరిగిందన్నారు. తెలుగు వారు ఎక్కడ ఉన్నా ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వ్యాక్యనించారు. ఋతుపవనాలు రాకముందే శ్రీశైలం హైడల్ ప్రాజెక్టును సమీక్షించి తద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన చర్యలు చేపట్టడమే తన పర్యటన ఉద్దేశం అన్నారు. నాటి కాంగ్రేస్ పెద్దల ముందుచూపుతో నిర్మించిన బహుళార్ధక సాదక ప్రాజెక్టుతో మన జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. శ్రీశైలం హైడల్ ప్రాజెక్టు ద్వారా అత్యదిక స్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటునామన్నారు. తెలంగాణా రాష్ట్రంలో రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేవని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రల అబివృద్ధికి అందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.



### ఇంజనీరింగ్ కోర్సుల్లో

## సీట్ల పరిమితి.. ఎత్తివేత..!

**- ఎవరికి లాభం..? ఎవరికి నష్టం..?**




**నంద్యాల విద్య, జూన్ 24, ప్రభాతవార్తః** 2024 విద్యాసంవత్సరం నుంచి ఇంజనీరింగ్ సీట్ల పరిమితిని ఏఐసిటిఈ ఎత్తివేసింది. దీంతో ఎంతమంది విద్యార్థులైనా ధరఖాస్తు చేసుకోవచ్చు ఇంజనీరింగ్ కోర్సుల్లో ఈమార్పుపై విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కలగాల్సి ఉంది. ఈకోర్సుల్లో అపరిమితంగా సీట్లు భర్తీచేసుకునేలా అల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటీఈ) కళాశాల యాజమాన్యాలు అదనపు బ్రాంచిలకు అనుమతులు తీసుకుంటున్నాయి. మౌలిక సదుపాయాలు అధ్యాపకుల అధారంగా అదనపు కోర్సుల ఏర్పాటుకు ఏఐసిటీఈ అనుమతులు ఇస్తుండడంతో చాల కళాశాలలు ఇంకా ధరఖాస్తు చేస్తున్నాయి. కొన్ని కళాశాలలకు ఇప్పటికే అనుమతులు లభించాయి. నూతన విద్యావిధానానికి అనుగుణంగా ఒక్కొక్క బ్రాంచిలో గరిష్ఠంగా 240 సీట్లకు పరిమితి ఉండేది. ఆ పరిమితిని తొలగించింది. డిమాండ్ మేరకు సీట్లు పెంచుకోవచ్చని తెలిపింది. ఇప్పటికే 89 ఇంజనీరింగ్ కళాశాలలు ధరఖాస్తు చేసుకోగా 75 కళాశాలలకు గుర్తింపు లభించింది. మిగిలిన 14 ఇంజనీరింగ్ కళాశాలలకు గుర్తింపు రావాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ విద్యలో కంప్యూటర్ సైన్స్‌కు విపరీతంగా డిమాండ్ ఉండడంతో ఒక్కొక్క కళాశాలలో 1000 సీట్లు వుంటే ఇందులో 650 సీట్లు కంప్యూటర్ సైన్స్ వాటి అనుబంధ కోర్సులు ఉన్నాయి. కన్వీనర్ కోటాలో సీట్లు పెరిగాయి. కంప్యూటర్ సైన్స్‌గ్రూపులో విద్యారులకు లాభం చేకూర్చి ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. నష్టం ఏవరికి అంటే విద్యావ్యాపార కోచింగ్ సెంటర్‌లలో 6వ తరగతి నుంచి విద్యార్థులను హింసకు గురిచేస్తు ముద్దు పేర్లతో పిలిచే కొన్ని కోర్సులకు డిమాండ్ తగ్గుతుంది. ఇంజనీరింగ్ విద్య భారీగా సీట్లు పెంచాలని ప్రభుతాన్ని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

## నేడు ఆదోని వైకాపా కార్యాలయం సీజ్..!

**- మున్సిపల్ కమీషనర్ రామచంద్రరెడ్డి**

**ఆదోని, జూన్ 24, ప్రభాతవార్త**



పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో ఉన్న వైసిపి కార్యాలయాన్ని నేడు సీజ్ చేస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ రామచంద్రరెడ్డి సోమవారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏపి ఎన్‌జివోస్ పేరిట ఉన్న స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే అనుచరుడు ఎర్రిస్వామి పేరుపై 99సం॥లు అగ్రిమెంట్ జరిగిన విషయం ఆదోని నియోజకవర్గ తెలిసిన విషయమే. అయితే స్థలాన్ని సుమారు ఒక శతాబ్ధం వరకు అగ్రిమెంట్ చేసుకున్నారు కానీ నిర్మాణం విషయంలో పురపాలక సంఘానికి కేవలం పైసా కూడా పన్ను చెల్లించలేదని కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులకు తెలిసింది. ఈ కోణంలో ఉన్నతాధికారులు మున్సిపాలిటీ ఫైలు పేరాలకు పేరాలు ఆరా తీస్తే అంత పెద్ద కార్యాలయ నిర్మాణం కోసం మున్సిపాలిటీ నుండి కనీసం పర్మిషన్లు తీసుకోకుండ అక్రమ నిర్మాణం చేపట్టారని మున్సిపల్ ఉన్నతాధికారులు కల్లుతెరిచి ఈ అక్రమ నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం వహించిన ఆ శాఖకు చెందిన ఇద్దరు అధికారులకు నోటీసులిస్తున్నామని తెలిపారు. ఈ కోణంలోనే గత పదిరోజులుగా వైసిపి కార్యాలయానికి మున్సిపాలిటీ నుంచి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు పోలీస్ సిబ్బందితో కలిసి ఆదోని వైసిపి కార్యాలయం సీజ్ చేస్తున్నట్లు కమీషనర్ తెలిపారు.



## సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించండి

**- జిల్లా కలెక్టరు డా.కె శ్రీనివాసులు**




**నంద్యాల, జూన్ 24, ప్రభాతవార్త ప్రతినిధిః** ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ధరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా కలెక్టరు డా. కె శ్రీనివాసులు జిల్లా అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాల్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టమ్-పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టరు స్వీకరించారు. జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్ రెడ్డి, డిఆర్వో పద్మజ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపద్యంలో స్వీకరించిన ప్రతి ఆర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణిత గడువులోగ పరిష్కరించాలని అధికారులను అదేశించారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత మళ్లి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారంచుట్టిందని... ఈమేరకు అధికారులందరు సీరియస్‌గా తీసుకొని గత స్పందన లాగిన్ ఐడిలతో ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అన్‌లైన్ సిస్టంలో కూడ లాగిన్ అయి ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టరు అదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడ ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేసే అవకాశం ఉందని ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏలోని ధరఖాస్తులు వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలని కలెక్టరు అదేశించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచివచ్చి కొన్ని విజ్ఞప్తులు నంద్యాల పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన రబీయా తాను గత ఫిబ్రవరి నెలలో రోడ్డు అక్రమణకు సంబంధించి సచివాలయం, మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదని నాపై దయవుంచి స్థల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరుకు ధరఖాస్తు సమర్పించుకున్నారు. అవుకు మండల చెన్నంపల్లె గ్రామ కాపురస్థురాలు పుల్లమ్మ తనకు 1.56 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని పిఎం కిసాన్, రైతుభరోసా పథకం డబ్బు పడడం లేదని జిల్లా కలెక్టరుకు ధరఖాస్తు చేసుకున్నారు. ఆత్మకూరు మండలానికి చెందిన ఫిరోజ్ బాషకు సర్వేనం.35/ఏలో 5.08 ఎకరాల పొలానికి సంబంధించి డి-నమూన పట్టా పొందాను కానీ అన్‌లైన్ ఈ-పాసుపుస్తకం రాలేదని అన్‌లైన్ చేపించి ఈ-పాసు పుస్తకం ఇప్పించగలని కోరుతు కలెక్టరు ధరఖాస్తు సమర్పించారు. ఇంకా ఈకార్యక్రమంలో 79 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరుకు అర్జీలు సమర్పించారు. ఈసమస్యలను వితిన్ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని కలెక్టరు ఎండార్స్ చేస్తు కలెక్టరు అదేశాలు జారీచేశారు.

## నూతన ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు విధులు బాధ్యతతో నిర్వర్తించాలి



**కర్నూలు, జూన్ 24, ప్రభాతవార్తః** నూతనంగా ఎర్పడిన ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు విధులను బాధ్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టరు డా.జి సృజన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన అడిటోరియంలో ఎన్టిఆర్ జిల్లా కలెక్టరుగా బదిలీపై వెల్లనున్న సందర్భంగా జిల్లా కలెక్టరు జిల్లాఅధికారులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్, రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో కలెక్టరుగా విదులను సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్క అధికారి ఎంతగానో సహకరించారని అదేవిధంగా సాధారణ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతిఒక్కరికి జిల్లా కలెక్టరు దన్యవాదాలు తెలిపారు. బదిలీపై ఇతర జిల్లాకు వెళ్తున్న తరుణంలో రెనోవెట్ చేసిన సునయన అడిటోరియంలో యధావిధిగా కార్యక్రమాలను నిర్వహించుకోవడం చాల సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల విధులను ప్రతి ఒక్కరు ఎంతో సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఫ్యాక్షన్ నేపద్యం ఉన్న ప్రాంతమైనటువంటి కర్నూలు జిల్లాలో ఈసారి ఎక్కడా కూడ హింసాత్మక సంఘటనలకు తావులేకుండా ప్రశాంతవాతావరణంలో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడానికి కృషిచేసిన జిల్లా అధికారులకు, సిబ్బందికి కలెక్టరు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో నేను ఎప్పుడు రాయలసీమ ప్రాంతంలో పనిచేయలేదని గత 14 నెలలుగా కర్నూలు జిల్లాలో కలెక్టరుగా విధులు నిర్వర్తించిన సమయంలో ప్రజలు, అధికారుల నుండి అందిన సహకారం, మర్యాద ఇతర జిల్లాల్లో ఎక్కడా కూడ చూడలేదని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో కొన్నిసార్లు అధికారుల పనితీరుపట్ల కఠినంగా వ్యవహారించినప్పటికి అది కేవలం పనిమీద ఉన్న అసక్తిపట్ల కఠినంగా వ్యవహారించాల్సి వచ్చిందే తప్పా వ్యక్తిగత కారణాలు ఏమి ఉండవని కలెక్టరు తెలిపారు...సాధారణ బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరుగా బదిలీపై వెల్లనున్న సందర్భంగా జిల్లా కలెక్టరు బాధ్యతలను జాయింట్ కలెక్టరుకు అపగ్రించడం జరిగిందన్నారు. తదనంతరం ప్రజాసమస్యల పరిష్కారవేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వినతులను కలెక్టరు స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టరు నారాపురెడ్డి మౌర్యకు జిల్లా ఇంచార్జీ కలెక్టరు బాధ్యతలు అప్పగించి కలెక్టరు రీలివ్ అయ్యారు. కార్య క్రమంలో జాయింట్ కలెక్టరు నారపురెడ్డి మౌర్య, డిఆర్వో మధుసూధన్‌రావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చట్ట పరిధిలో సమస్యలు పరిష్కారం




**నంద్యాల క్రైం, జూన్ 24, ప్రభాతవార్తః** ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరిధిలో న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఫిర్యాదుదారులకు భరోసా కల్పించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈనేపథ్యంలో సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టపరిధిలో ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదేశించారు. ఫిర్యాదుదారులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని అదేశించారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని ఎస్పీ అదేశించారు. ఈకార్యక్రమంలో ఎస్పీ సిఐ రవీంధ్ర, సిసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ముఖ్యమంత్రిలా వ్యవహారించలేదు

**- ఓటమికి జగనే కారకుడు**



**కర్నూలు హాస్పిటల్, జూన్ 24, ప్రభాతవార్తః** వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి వీరాభిమానిని మీ దుశ్చర్యలను పనికిమాలిన పాలనను చూడలేక తెలుగుదేశం పార్టీలో చేరానని ఇంజనీరింగ్ కళాశాలల అధినేత, తెలుగుదేశం పార్టీ నాయకులు కెవి సుబ్బారెడ్డి చెప్పారు. సోమవారం తన నివాసంలో జరీరం కళాశాలల అధినేత టిడిపి సీనియర్ నాయకులు కెవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ చేసిన తప్పులను జగన్ ఒప్పుకోవాలని జగన్ తాడేపల్లికి అంకితమయ్యారని పరిపాలనను పక్కన పెట్టారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఏనాడు వ్యవహారించలేదని చెప్పారు.

## పశువైద్యం..దైవాదీనం..!

**- అందని ద్రాక్షాలా..తుగ్గలిలో పశువైద్యం..**

**- మూగజీవాలే కదా..!బ్రతికినా చచ్చిన..ప్రశ్నించే వారెవరు..!**

**- పశువులకు అటెండర్లు జీవ,గోపాలమిత్ర లా వైద్యమే దిక్కు**



**తుగ్గలి, జూన్ 24, ప్రభాతవార్త**

రైతులకు పాడి, పంట రెండు కళ్లలాంటివి. వ్యవసాయంలో చేదోడు..వాదోడుగా.. ఉండే పశువులను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. రైతుల ప్రాణం కన్నా ఎక్కువగా ఆశలు పెట్టుకొని కన్న కొడుకులా సాదుకునే పాడి పశువులకు రోగం వస్తే తుగ్గలిలో చికిత్స చేసే దిక్కే లేదు. వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన పశువులకు తుగ్గలి పశువైద్యశాలలో సరైన వైద్యం అందక మృత్యువాత పడుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలిలోని రైతు ముక్కెల్ల కాసీంకు చెందిన గొర్రెను ఆవు పొడిచి కడుపులోని పేగులు బయటకు రావడంతో జరిగింది. అయితే ఆ రైతు ఆ మూగజీవాన్ని బ్రతికించుకు నేందుకు పశువైద్యశాలకు గొర్రెను తీసుకెళ్తే అక్కడ తాళాలు వేసిన పశువైద్యశాల దర్శనమిచ్చింది. దీంతో అతడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న గొర్రెను ఏమి చేయాలో తోచక పశువైద్య సిబ్బందిని చరవాణి ద్వారా సంప్రదించడం జరిగిందన్నారు. అయితే పశువైద్య సిబ్బంది తాము హాస్పిటల్‌లో ఎవరూ లేమని ఒక గంట తర్వాత వచ్చి వైద్యం చేస్తానని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారన్నారు. అయితే ఆ రైతు చేసేదేమీ లేక గాయపడిన గొర్రెను ఇంటికి తీసుకెళ్లిన తర్వాత జీవమిత్ర ద్వారా వైద్యం చేయించడం జరిగిందన్నారు. ఇలా మండలంలో మరెన్నో పశువులు సీజనల్ వ్యాధులు ప్రబలి మృతి చెందుతున్నా పట్టించుకున్న పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పశువైద్య అధికారుల నిర్లక్ష్యం వల్ల తుగ్గలి పశువైద్యశాలలో పశువైద్యం పడకేసిందని మూగజీవాలే కదా..!బ్రతికినా..చచ్చినా..ప్రశ్నించే వారెవరు అన్న తీరులో వైద్య సేవలు జరుగుతున్నా అధికారులు, పాలకులెవరు పట్టించుకోవడం లేదంటూ రైతులు లబోదిబోమంటున్నారు. రోగాల బారిన పడిన పశువులకు అటెండర్లు, జీవామిత్ర, గోపాలమిత్ర వైద్యమే దిక్కవుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు మృత్యువాత పడుతున్న మూగజీవాల ప్రాణాలకు పశువైద్యులచే సరియైన వైద్యం అందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

# టిడిపి వర్గీయులు మున్సిపల్ చైర్మన్‌పై దాడియత్నం అమానుషం

**- ఎమ్మెల్సీ ఇసాక్ బాషా**

నంద్యాల క్రైం, జూన్ 24, ప్రభాతవార్త: ముస్లీం మైనార్టీ మహిళా మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా బేగంపై టిడిపి వర్గీయులు దాడియత్నానికి, దౌర్జన్యానికి పాల్పడడం అమానుషమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్సీ ఇసాక్ బాష పేర్కొన్నారు. ఈసందర భ్ంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ 29వ వార్డు సచివాలయంలో టిడిపి వర్గీయులు మహిళలు అని చూడకుండా దౌర్జన్యం దాడికి దిగారని ఆరోపించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నంద్యాలలో ప్రశాంతవాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పందించాలని, మైనార్టీ మహిళలకు న్యాయం చేయాలని కోరారు. నంద్యాలలో ప్రశాంతవాతావరణానికి రాజకీయ నాయకులు సహరిస్తున్నారని నేడు కొత్త సంస్కృతిని తీసుకు రావడం మంచిపద్దతి కాదన్నారు. ఉపముఖ్యమంత్రి



ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయడం సాంప్రదాయంగా వస్తుందని ఈ వ్యవహారం అంత సమాచారశాఖ వారు సంబంధిత అధికారులు చుస్తారని తెలిపారు. టిడిపి వర్గీయులు సచివాలయంలోకి ప్రవేశించి సిఎం, డిప్యూటి సిఎంల ఫోటోలతో వచ్చి పెట్టాలని మున్సిపల్ చైర్మన్‌పై రగడ, ఘర్షణకు దిగడం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. ముస్లీం మైనార్టీ మహిళను ఏకవచనంతో దుర్భాషలాడడం సరైంది కాదని మహిళపై చైఎత్తి కొట్టేందుకు ప్రయత్నిం చడం మంచిపద్ధతికాదన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహాజమేనన్నారు. గతంలో మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన ఫరూక్ హయాంలో మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడడం లాంటి సంఘటనలు లేవనా న్నరు. అంతేకాక మున్సిపల్ చైర్మన్ ఇంటిని ఖాళీచేయిస్తాం నడిరోడ్డుపై నిలబెడతామని హెచ్చరికలు జారీచేయడం ఎంతవరకు సమంజసమనా న్నరు. మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా మాట్లాడుతూ మాపై దౌర్జన్యసంఘటన మాకు ఎంతో అవమానకరంగా ఉందని ఒక ముస్లీం మహిళా అని చూడకుండా ఇష్టమొచ్చిన బాషతో మాట్లాడడం మహిళ అని చూడకుండా చీరేస్తా, ఏయ్యి, ఏం పీక్కుంటారో పిక్కో అంటూ ఇది అతిచేస్తుంది.. మాటల్లో చెప వ్రలేని విధంగా తనను అవమానపరి చారని అవేదన వాపోయింది. సిఎం, డిప్యూటి సిఎం ఫోటోలను సంబంధిత అధికారులతో ఏర్పాటు చేయిస్తామని చెప్పినా టిడిపి వర్గీయులు వినకుండా దౌర్జన్యానికి, దాడికి దిగారని అరోపించారు. ఈసమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీదర్, పాంషావలి, వైసీపీ కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు, వార్డు ఇంచార్జీలు తదితరులు పాల్గొ న్నారు.

## వెండి రధోత్సవం పై మల్లన్న వైభవం

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్24, ప్రభాతవార్త**



శ్రీశైలక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సోమవారసేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఉభయదేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో సా వ్యమి అమ్మవార్ల ఉత్స వమూర్తులకు సహస్రదీపార్చన జరిపారు. ముందుగా ఉత్స వరులకు ప్రత్యేక అర్చనలు, హరతి పూజలు జరిపి తదుపరి వెయ్యి దీపాలు వెలిగించి దీపార్చన నిర్వహించారు. అనంతరం ఉభయదేవాలయ ప్రాంగణంలో స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్స వ సేవ జరిపారు. మల్లన్నకు అత్యంత ప్రీతికరమైన రోజుగా భావించే సోమవారం స్వామిఅమ్మవార్లకు శాస్త్రబద్ధంగా దీపార్చన, వెండిరథసేవలు నిర్వహించడం ఆనవాయితి. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకస్వాములు, వేద, ఆగమ పండింతులు పాల్గోనా న్నరు.

## ఏపిజిఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక

**పత్తికొండ, జూన్ 24, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఈఏ) పత్తికొండ తాలుక యూనిట్‌కు నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. సభ్యులందరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం ఆంజనేయులు నాయక్ తెలిపారు. పత్తికొండ తాలుక నూతన కార్యవర్గం రియాజ్‌భాష ఆద్వర్యంలో సోమవారం కొలువుదీరింది. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కార్యదర్శిగా టి భరత్, కోశాధికారిగా జిలానీ భాష, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యండి దివాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి వెంకటేష్‌లు ఎన్నికయ్యారని తెలిపారు. పత్తికొండ తాలుకా పరిధిలోని ఉద్యోగుల హక్కులు మరియు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు రియాజ్ భాష తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని వాహనాలకు జరిమానా



**ఆదోనిటౌన్, జూన్24, ప్రభాతవార్త;** జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఆదోని డీయస్పీ శివనారాయణస్వామి ఆదేశాల మేరకు నిబంధనలు పాటించని వాహన దారులపై చర్యలు తీసుకుంటున్నట్లు ఆదోని ట్రాఫిక్ సీఐ బి.ఎ.మంజునాథ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణ పరిసరాల్లో ప్రమాదాలను నివారించడానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టి రాంగ్ పార్కింగ్, రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు లేని 38 వాహనాలకు రూ.10,930 జరిమానా విధించినట్లు చెప్పారు. 9 వాహనాలను ఎంవీఐ ఆదోని వారికి పంపించామన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 60 శాతం రాయితీ ఇవ్వాలి

**-ఎంఇఓ-2 రమేష్‌కు వినతిపత్రం అందించిన జర్నలిస్టుల సంఘం నాయకులు...**

**వెల్దుర్తి, జూన్24, ప్రభాతవార్త :** జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల్లో 60 శాతం రాయితీ ఇవ్వాలని కోరుతూ సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఇఓ-2 రమేష్‌కు ఏపియుడబ్ల్యూజె సంఘం నాయకులు (జర్నలిస్టులు) వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపియుడబ్ల్యూజె పత్తికొండ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పాఠశాలలు, కళాశాలల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ ఇవ్వాలని ఎంఇఓకు విన్నవించుకున్నామన్నారు. మా ఈ విన్నపాన్ని జిల్లా విద్యాశాఖాధికారికి పంపాలని ఎంఇఓను కోరామన్నారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యానికి సైతం ఫీజు రాయితీ విషయాలపై తగు సూచనలు ఇవ్వాలని చెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం పత్తికొండ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రావు, మండల అధ్యక్షులు షేక్.అమీర్, నాయకులు మారెన్న, ఈశ్వరయ్య, రాజశేఖర్, దస్తు, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మృతి భర్తపై కేసు నమోదు

**కొలిమిగుండ్ల, జూన్ 24, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని సాయిబాబాగుడి పక్కనున్న కుమ్మరి సుబ్రమణ్యాం భార్య కుమ్మరి గంగాశ్రావణి (25) 23వ తేది ఉరివేసుకొని ఆతహత్యచేసుకున్న విషయం విధితమే. వివరాల్లోకి వెళ్లితే భర్త పిసినారితనం మానుకోవాలని ఎంత చెపి న్రనా వినకపోవడంతో ఆమె జీవితంపై విరక్తిచెంది గత ఆదివారం ఇంట్లో ఏవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొలిమిగుండ్ల సిఐ గోపినాధ్‌రెడ్డి మృతురాలి భర్తపై కేసు నమోదుచేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా మమ్మస్మృతి దినం వేడుకలు

**పత్తికొండ, జూన్ 24, ప్రభాతవార్త**

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల దగ్గరున్న ఓం శాంతి కార్యాలయంలో మమ్మ స్మృతి 59వ దినం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారి ఓం శాంతి నిర్వాహకులు శ్రీలక్ష్మి మమ్మ విశిష్టతలను తెలియజేశారు. అనంతరం బ్రహ్మకుమారి ఓం శాంతి కార్యాలయ సోదర, సోదరీమణులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి ఓం శాంతి సభ్యులు బికె లక్ష్మి, అనంతమ్మ, జయలక్ష్మి, సరోజమ్మ, నాగమణి, రంగన్న, సదానంద, సుబ్రమణ్యాం, శివకుమార్, ఉదయ్, ఓం శాంతి సోదర, సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ నిర్వహణలో జరిగిన స్కాంలపై విచారణ చేపట్టాలి

**ఆదోనిలీగల్, జూన్24, ప్రభాతవార్త;** నీట్-2024 పరీక్ష నిర్వహణలో జరిగిన స్కాంలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని, నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాని పీడీఎస్ఓ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని కోట్లాది మంది ప్రజల ప్రాణాలు, లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆధారపడిన వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్ నిర్వహణలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీ స్కామ్‌లపై రోజుకొక కొత్త విషయం బయటకు వస్తోందన్నారు. పరీక్షకు ఒకరోజు ముందే ప్రశ్నాపత్రం సోషల్ మీడియాలో ఎలా లీక్ అయ్యిందన్న దానిపై కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులను శిక్షించాలన్నారు. నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యం క్రమంలో పీడీఎస్ఓ డివిజన్ సెక్రటరీ శివ, గిడ్డయ్య, మహిళా కన్వీనర్స్‌లు నిఖీత, శ్రావణి, వీరేష్, ప్రవీణ్, రంగస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వస్త్రదుకాణాన్ని ప్రారంభించిన సినీనటుడు సుమన్

**పత్తికొండ, జూన్ 24, ప్రభాతవార్త**



పత్తికొండ పట్టణంలో సోమవారం సినీనటుడు సుమన్ సందడి చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ కర్నూలు రోడ్డులో ఎద్దుల కాటా ప్రైవేట్ లిమిటెడ్ వస్త్రదుకాణ ప్రారంభోత్స వానికి సినీనటుడు సుమన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎద్దుల కాటా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత మహేశ్వర్‌రెడ్డి, సూర్యరెడ్డి, సత్యారెడ్డిల ఆద్వర్యంలో వస్త్రదుకాణాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ప్రజలకు సరళమైన ధరలకే దుస్తులు అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు. సినీనటుడు సుమన్ ప్రారంభోత్సవానికి రావడంతో పట్టణ ప్రజలు సుమన్‌ను చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు బ్రహ్మయ్య, భాస్కర్, రామానాయుడు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

**బనగానపల్లెరూరల్ ,జూన్ 24, ప్రభాతవార్త:**



బనగానపల్లె మండలంలోని బీరవోలు ప్రాథమిక పాఠశాల నందు జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జె.ఎస్.ఎస్.బ్రహ్మానందాచారి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అదే విధంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్రహ్మానందాచారి మాట్లాడుతూ సమిష్టి కృషితో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. అలాగే 5 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాలలోపు పిల్లలతో పనిచేయించుకోవడం చట్టరీత్యా నేరమని ఆయన గుర్తు చేశారు. అదే విధంగా పెద్దలు పనులకు పిల్లలు బడులకు అనే నినాదంతో మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను బ్రహ్మానందాచారి కోరారు. విద్యార్థులకు బడిబాటనే బంగారు బాటనా న్నరు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి, విద్యార్థులు చదువుకుంటే కలిగే లాభాల గురించి బ్రహ్మానందాచారి వివరించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం ఆర్.ఉసేన్‌బాషా, ఉపాధ్యాయుడు నాగేంద్రుడులు మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రయివేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించండి

**- ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకుల డిమాండ్**

**కౌతాళంరూరల్, జూన్24, ప్రభాతవార్త;** ప్రయివేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకుల డిమాండ్ చేశారు. మండలకేంద్రమైన కౌతాళంలో ఏపీయూడబ్ల్యూజే యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జర్నలిస్టు పిల్లలకు ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని కోరుతూ ఏపీడబ్ల్యూజే యూనియన్ నాయకులు ఎంఈఓ కార్యాలయం అధికారి శాంతప్పకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు మాట్లాడుతూ కౌతాళంలో చాలామంది జర్నలిస్టులుగా పనిచేస్తున్నామన్నారు. మండలంలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల్లో మా పిల్లలకు ఉచిత విద్యను ఇవ్వాలని కోరారు. గతంలో మాదిరిగా ఈ యేడాది కూడా 2024-25 విద్యా సంవత్సరంలో ఫీజు రాయితీ అమలు చేసేవిధంగా ఆయా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసి మా పిల్ల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే యూనియన్ గౌరవాధ్యక్షులు మహమ్మద్, మండలాధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షులు అంజి, సాదిక్, సహాయ కార్యదర్శి శివకుమార్, కోశాధికారి ముక్తర్‌బాషా, తాలూకా కార్యవర్గ సభ్యులు ఉమేష్‌గౌడ్, ముదుకప్ప, యూనియన్ సభ్యులు అనిల్‌కుమార్, రాముడు, జట్టప్ప తదితరులు పాల్గొన్నారు.

## 30 మద్యం బాటిళ్లు స్వాధీనం

**చాగలమర్రి ,జూన్ 24, ప్రభాతవార్త:** 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమణయ్య సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మండల కేంద్రమైన చాగలమర్రి పట్టణంలోని ముత్యాలపాడు బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కడప జిల్లా రాజుపాలెం మండలం పగిడ్యాల గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసులును తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వివరించారు.

## కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో సీట్లను పెంచాలి

**- దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీట్లు కేటాయించాలి**

**కౌతాళంరూరల్, జూన్24, ప్రభాతవార్త;**



కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో సీట్లు పెంచాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీట్లు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ పిలుపు మేరకు కౌతాళం మండల ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు కె.మంజునాథ్, మండల కార్యదర్శి గురుబసవరాజు మాట్లాడుతూ వెనకబడిన ప్రాంతాల విద్యార్థుల విద్యను అందించాలని ప్రతిష్టాత్మకంగా హాస్టల్ సౌకర్యంతో ఏర్పాటు చేసిన కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో సీట్లు వచ్చాయని, మిగతా విద్యార్థులకు సీటు రాకపోవడంతో విద్యను మధ్యలోనే వదిలేసే పరిస్థితి నెలకొందన్నారు. అక్షరాస్యతలో వెనుకబడిన మండలం కరువు, కాటకాలతో అల్లాడిపోతుందన్నారు. మరోపక్క విద్యార్థులు సైతం తల్లిదండ్రులు వలసలు వెంటపెట్టుకుని వెళ్లిపోతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీట్లను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షులు సాయివర్మ, మహేష్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు బి.గంగారాం, ఎం.ఖాదర్‌బాషా, అంజి, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యా సంస్థల్లో రాయితీ కల్పించాలి

**గూడూరు, జూన్ 24, ప్రభాతవార్త :** ప్రైవేట్ విద్యా సంస్థలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ కల్పించాలని గూడూరు మండల జర్నలిస్టుల సంఘం నేడు ఒక ప్రకటనల్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు రాయితీ కలి ్పంచాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్య క్రమంలో గూడూరు మండల జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు దౌలత్‌భాష, ఉరుకుంద, శ్రీనివాస నాయుడు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాదులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**ఆత్మకూరు జూన్24, ప్రభాతవార్త:**



సీజనల్ వ్యాదులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని బైర్లూటి వైద్యాధికారులు గోపాల్, పవన్ కుమార్‌లు అన్నారు. సోమవారం బైర్లూటి పరిధిలోని నాగలూటి గూడెం నందు వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డయేరియా భారీన పడకుండా ప్రతి ఒక్కరు త్రాగునీటిని కాచి వడబోసి త్రాగాలని తెలిపారు. గూడెంలో ఉన్న ట్యాంకులను సందర్శించి నీటిని సేకరించి వాటి నాణ్యత గురించి పరీక్షలకు పంపామన్నారు. దోమతెరలు వాడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి గర్భవతి తప్పనిసరిగా ప్రతినెల వైద్యాధికారి చేత వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవణమ్మ, సిహెచ్ఓలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేట్, కార్పోరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**వార్త కథనానికి స్పందించిన విద్యార్థి సంఘాలు**

**ఆత్మకూరు జూన్24, ప్రభాతవార్త:** విద్యా సామాగ్రి దుఖాణాలు ఏర్పాటు చేసిన కార్పోరేట్ ప్రవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి స్వామిదాసు నాగార్జున అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో కార్పోరేట్, ప్రవేట్ విద్యా సంస్థల ధన దాహానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా నలిగిపోతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల విద్యను ప్రవేట్ స్కూల్స్ యాజమాన్యలు వ్యాపారంగా మార్చేశారని నిబందనలకు విరుద్దంగా పీజులు వసూలు చేయడమే కాకుండా జిఓ నెంబరు 1 విరుద్దంగా పాఠశాలోనే ప్రత్యేకంగా దుఖాణాలను ఏర్పాటు చేసి డ్రస్సులు, పుస్తకాలు విద్యా సామాగ్రి ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యాహక్కు చట్టాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.



## కర్నూలు ఎంపీగా బస్తిపాటి ప్రమాణ స్వీకారం



**కర్నూలు హాస్పిటల్, జూన్ 24, ప్రభాతవార్త:** కర్నూలు ఎంపీగా బస్తిపాటి నాగరాజు పార్లమెంటు ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ నాగరాజు చేత ప్రమాణం చేయించారు. బస్తిపాటి నాగరాజు అనే నేను అంటూ తెలుగులో ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. కాగ బస్తిపాటి గడిచిన ఎన్నికల్లో టిడిపి పార్టీ తరుపున పోటీచేసి వైసీపీ అభ్యర్థి బి వై రామయ్యపై లక్ష 11 వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందారు. ఎంపీగా బస్తిపాటి నాగరాజు ప్రమాణస్వీకారం చేయడంతో జిల్లా టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**పత్తికొండ, జూన్ 24, ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు అరుణ్‌కుమార్, సుజాతలు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డయేరియాపై మండల అభివృద్ధి కార్యాలయం నందు మండల అభివృద్ధి అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాలు ఎక్కువగా రావడం వల్ల కొళాయి పైపులు లీకేజీ ద్వారా తాగునీరు కలుషితం కావడం, వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం వలన వాంతులు, విరేచనాలు అవుతాయన్నారు. ప్రతి 15రోజులకోసారి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించి ట్యాంకు నిండిన తర్వాత క్లోరినేషన్ చేయించాలన్నారు. మూతలు లేని ట్యాంకులకు మూతలు పెట్టించాలన్నారు. ఎక్కడైనా కొళాయి పైపులు లీకేజీ ఉంటే వెంటనే రిపేరి చేయించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మండల అభివృద్ధి అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు తెలియజేశారు. ఈ సీజన్‌లో ఇంటింటి సర్వే చేసి వాంతులు, విరేచనాలు అయ్యే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఇవ్వాలని, వేడి చేసి చల్లారిన నీటిని తాగాలని, శుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. డ్రమ్ములు, తొట్టెలు, బిందెలు శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత నీరు నింపుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండ దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వసుంధర, పబ్లిక్ హెల్త్ నర్సు గంగారత్న, సూపర్‌వైజర్లు రవికుమార్, ప్రకాష్, లక్ష్మీదేవి, వరలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌లు, పంచాయతీ, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ఆదోనిటౌన్, జూన్24, ప్రభాతవార్త;**



మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సెబ్ పోలీసులు సూచించారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని జ్యోతిర్మయి మెమోరియల్ జూనియర్ కాలేజ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాలు గుట్కా, గంజాయి, కొకైన్ వంటి వాటిని ఎవరూ వినియోగించరాదన్నారు. ఇది చట్ట వ్యతిరేకమని చెప్పారు. ప్రపంచాన్ని మాదక ద్రవ్యాలు ముక్తం చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు సహకారాన్ని, చర్యలను బలోపేతం చేసేందుకు ప్రతి యేడాది జూన్ 26వ తేదీన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్స వాన్ని నిర్వహిస్తామన్నారు. ఈసారి కూడా అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, కాంపిటేషన్స్‌లు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని చెప్పారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రాముడు మృతి



**తుగ్గలి, జూన్ 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాతన గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న వెంకట్రాముడు(58) సోమవారం ఉదయం అనారోగ్యంతో కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతూ మృతిచెందారు. సంజామల మండలానికి చెందిన ఆయన గత కొన్నేళ్లుగా రాతన గిరిజన ఆశ్రమ పాఠశాలలో వార్డెన్, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అయితే ఆయన గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. అయితే కోలుకోలేక మృతిచెందారు. అతని మృతదేహాన్ని తన స్వగ్రామంకు తరలించి అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఒక కొడుకు, ఒక కూతురు వున్నారు.

## కొలిమిగుండ్లలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు

**కొలిమిగుండ్ల, జూన్ 24, ప్రభాతవార్త:**



కొలిమిగుండ్ల మండల కేంద్రంలో తెలుగు తమ్ముళ్లు నంద్యాల ఎంపీగా బైరెడ్డి శబరి పార్లమెంటులో ప్రమాణస్వీకారం చేసిన సందర భ్ంగా గూడురు శివరామిరెడ్డి అధ్వర్యంలో కేక్ కట్‌చేసి బాణసంచా పేల్చి తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. ఈసందరర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఎంపీగా టిడిపి పార్టీ తరుపున పోటీచేసి భారీ మెజార్టీతో విజయం సాధించడం వెనుక టిడిపి కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. ఈకార్య క్రమంలో గూడూరు నాగేశ్వర్‌రెడ్డి, బొట్టు స్వామి, టైలర్ రాముడు, దాసరి దస్తగిరి బ్రదర్స్, రాజీనేని బ్రదర్స్, నిమ్మకాయల దస్తగిరి, కేశవరెడ్డి, నాగేశ్వర్‌రావు, ఎమ్మార్పీఎస్ దస్తగిరితోపాటు అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరుగు పందెంలో విజేతగా నిలిచిన బసవ

**- రూ.5వేలు ప్రోత్సాహ బహుమతి అందించిన సర్పంచ్**



**పెద్దకడుబూరు, జూన్ 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నౌలకల్ గ్రామంలో సోమవారం జరిగిన ఏరువాక పౌర్ణమి వేడుకలు సందర్భంగా గ్రామంలో నిర్వహించిన పరుగు పందెం పోటీల్లో గ్రామానికి చెందిన బోయ శేఖర్ కుమారుడు బసవ అనే యువకుడు విజేతగా నిలిచాడు. యువకుడిని వైసిపి నాయకులు ఇంటి దగ్గరకు ఊరేగింపుగా తీసుకొచ్చి శాలువా, పూలమాలతో అభినందించి గ్రామ సర్పంచ్ పల్లవి నరేష్ కుమార్‌గౌడ్ తరుపున రూ.5వేలు నగదును అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు హనుమప్ప, అంజినయ్య, నాగరాజు, హనుమంతు, అయ్యప్ప, శరణప్ప, వెంకటేష్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## సినీ హీరో సుమన్ సందడి



**దేవనకొండ, జూన్ 24, ప్రభాతవార్త :** సినీనటుడు హీరో సుమన్ పత్తికొండ పట్టణానికి క్లాత్ షోరూం ప్రారంభో త్సవానికి వచ్చి తిరుగు ప్రయాణం లో దేవనకొండ మీదుగా వెళుతుం డగా శ్రీ లక్ష్మీరంగా కళ్యాణ మండపం వద్ద టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, మలకన్న, వెలమకూరు సర్పంచ్ భాస్కర్, బజాజ్ షోరూం ఫజ్జులు భాష, అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు వేణు మహారాజ్‌ల ఆద్వర్యంలో అభిమానులు సందడి చేశారు. ఈ సందర్భంగా సినీ హీరో సుమన్‌ను పూలదండలతో దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజశేఖర్‌గౌడ్, గిడ్డయ్యగౌడ్, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలి

**-ఏఓ అబ్దుల్ హాక్**



**అవుకు, జూన్ 24, ప్రభాతవార్త:** అవుకు పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం వి అబ్దుల్ హాక్ గ్రామ వ్యవసాయ మరియు ఉద్యానవన సహాయకులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని ఎంతో విస్తీర్ణంలో పంటలు సాగుఅవుతున్నాయో ఎప ్పటికప్పుడు నివేదిక అందజేయాలని ఆయన అధికారులకు తెలియజేశారు. అదేవిధంగా ఐదు శాతం పిఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్ పూర్తిచేయాలని అలాగే గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. ఈకార్య క్రమంలో మండలంలోని ఏఓలు పాల్గొన్నారు.

## గ్రామాల్లోని ప్రజలకు శుద్ధనీటిని సరఫరా చేయాలి

**మంత్రాలయం, జూన్ 24, ప్రభాతవార్త:** మండలంలోని గ్రామాల ప్రజలకు శుద్ధకరమైన తాగునీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వేదస్వరూప అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, మండల స్థాయి అధికారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం మారినందున డయేరియా వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా మండల వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపటా ్టలన్నారు. తాగునీటి సరఫరా విషయంలో పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి ప్రభావతి, మండల వైద్యాధికారి గోవిందమ్మ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏపిజిఈఏ ఆలూరు తాలుక నూతన కార్యవర్గం ఎన్నిక

**ఆలూరు, జూన్ 24, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపిజిఈఏ) ఆలూరు తాలుక యూనిట్‌కు నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ సెక్రటరీ సురేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సభ్యులందరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఆలూరు తాలుక నూతన కార్యవర్గం అధ్యక్షురాలు శశికళ ఆద్వర్యంలో కొలువుదీరిందన్నారు. కార్యదర్శిగా ఉల్తెప్ప, కోశాధికారిగా విష్ణువర్థన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజన్నలు ఎన్నికయ్యారన్నారు. ఆలూరు తాలుకా పరిధిలోని ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్షురాలు శశికళ తెలియజేశారు.

## 29న పురపాలక కౌన్సిల్ సమావేశం

**నందికొట్కూరు, జూన్ 24, ప్రభాతవార్త:** ఈ నెల 29న పట్టణ పురపాలక కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడుతుందని కమీషనర్ టి.సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పాలకవర్గ సభ్యులు పాల్గొంటారని కావున అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన తెలిపారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రాముడు మృతి



**తుగ్గలి, జూన్ 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాతన గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులుగా పనిచేస్తున్న వెంకట్రాముడు(58) సోమవారం ఉదయం అనారోగ్యంతో కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతూ మృతిచెందారు. సంజామల మండలానికి చెందిన ఆయన గత కొన్నేళ్లుగా రాతన గిరిజన ఆశ్రమ పాఠశాలలో వార్డెన్, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అయితే ఆయన గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. అయితే కోలుకోలేక మృతిచెందారు. అతని మృతదేహాన్ని తన స్వగ్రామంకు తరలించి అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఒక కొడుకు, ఒక కూతురు వున్నారు.

## టిడిపి కార్యకర్తలను పరామర్శించిన రామకృష్ణారెడ్డి

**మంత్రాలయం, జూన్ 24, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలం మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని సౌళహళ్ళి గ్రామంలో ఏరువాకపౌర్ణమి పర్వదినం సందర్భంగా జరిగిన ఇరువర్గాల దాడిలో గాయపడిన గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు కేతయ్య, రాముడులను టిడిపి ఇంఛార్జ్ రాఘవేంద్రరెడ్డి సోదరుడు రామకృష్ణారెడ్డి సోమవారం పరామర్శించాడు. టిడిపి నాయకులపై దాడిచేసిన వైసిపి కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులకుతెలియజేస్తామన్నారు. మీరు త్వరితగతిన కోలుకొని పార్టీకి మీ విలువైన సేవలను అందించాలని కోరారు. వారి కుటుంబ సభ్యులకు ధర్యంచెప్పారు. వీరివెంట నాయకులు అంజి, రాముడు, వీరాంజి, వీరేష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం..

**దేవనకొండ, జూన్ 24, ప్రభాతవార్త :** పరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యాలు పదిలంగా ఉంటాయని ఈఓపిఆర్ అండ్ ఆర్‌డి సూర్యనారాయణ అన్నారు. సోమవారం ఈఓపిఆర్ అండ్ ఆర్‌డి సూర్యనారాయణ ఆద్వర్యంలో మండల పరిధిలోని కప్పట్రాళ్ల గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు తమ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దరి చేరవన్నారు. రోగాలు ప్రబలకుండ ఉండేందుకు గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుల చేత డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పూడికను తీయడం జరిగిందన్నారు. గ్రామాల ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## కార్పొరేట్,ప్రైవేట్ స్కూళ్లలో జర్నలిస్టుల పిల్లలకు రాయితీ కల్పించాలి

**ఆలూరు, జూన్ 24, ప్రభాతవార్త :** ఆలూరు మండలంలోని కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో జర్నలిస్టుల పిల్లలకు 100శాతం రాయితీ కల్పించాలని ఏపిడబ్ల్యుజె తాలుక అధ్యక్షులు సురేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, వీరేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ఏపిడబ్ల్యుజె ఆద్వర్యంలో మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం రాయితీ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు స్వరూప్ కుమార్, లీగల్ అడ్వైజర్ రాజేష్, జర్నలిస్టులు అంజి, టివి5 గోపాల్, గుత్తి నాగరాజు, రాంప్రసాద్, రామ్మోహన్, గోపాల్, ఖాదర్, చిన్న సోమన్న, ఎర్రిస్వామి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## అతిసార వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



**నందికొట్కూరు, జూన్ 24, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో అతిసార ప్రబలకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సి.పి.ఐ.నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా నాయకులు సి.పి.ఐ. వి.రఘురాంమూర్తి, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనువాసులు తహాసిల్దార్ దామోదర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతు నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండం చాబోలలు గ్రామంఓ ప్రజలు కలుషిత నీరు త్రాగి అతిసార వ్యాధికి గురై ఒకరు మృతి చెందారని అతని కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఎక్కడ కూడ నీటి ట్యాంకులను శుభ్రం చేయడంలేదని, నీటిలో క్లోరిడేషన్ ద్రవ పదార్థం వేడంలేదన్నారు. ట్యాంకులకు పైన మూతలు లేవని దీంతో పక్షులు ఇతర జీవాలు అందులో పడుతున్నాయని ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మౌలాలి, రాజు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలి




**కర్నూలు విద్య, జూన్ 24, ప్రభాతవార్తః** కర్నూలు నగరంలోని స్థానిక ఇందిరా గాంధీ నగర్‌లో ఉన్నటువంటి ఎస్సీ మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, సోమవారం ప్రజాదర్బార్‌లో జేసి మౌర్యకు వెంటనే సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ అధికారులను పిలిపించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి తమ చదువుల కోసం పేద బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు కర్నూలులోని సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక వసతులు ఉంటాయని వస్తే ఇక్కడ మాత్రం వార్డన్లు కనీస వసతులైన తాగునీరు. మరుగుదొడ్లు, మంచి ఆహారం కూడ విద్యార్థులకు అందించడం లేదని వీటిపై వార్డన్‌ను పలు విద్యార్థులు సమస్యలపై మాట్లాడితే దీనికి సంబంధించిన ఒక్కరోజు ఒక విద్యార్థికి కేవలం రూ.50లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని దానితో మీకు మెను ప్రకారం భోజనమైనా నేను అందించలేనని మీకు రూ.50లు ఇస్తాను మీరే బయటతినేసిరండని చెప్పడం చాల దుర్మార్గం అన్నారు. వార్డన్‌ను వెంటనే సస్పెండ్ చేసి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని, జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు వీరేష్, రాజు అంజీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే మన జీవితాలు మారుతాయి

:-టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి



**రచ్చుమర్రి(మంత్రాలయం), జూన్ 24, ప్రభాతవార్త:** విద్యతోనే సమాజంలోని మనందరి జీవితాలు మారతాయని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జ్ రాఘవేంద్రరెడ్డి సోదరులు రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రచ్చుమ ర్రి గ్రామ సమీపంలో ఉన్న మోడల్‌స్కూల్ విధ్యార్థినీ, విధ్యార్థులకు ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హాయాంలో నిర్మంచడానికి మొదలుపెట్టిన ప్రహారీగోడ నిర్మాణాన్ని ప్రభుత్వంతో చర్చించి తప్పకుండా పూర్తి చేస్తామన్నారు. మోడల్‌స్కూల్ విధ్యార్థులు, సిబ్బందికి ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తెలియజేయాలన్నారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహులు, పోలిశివప్ప, పోలి వీరేష్, ఉసేని, హనుమంతు, నారాయణ, రామయ్య, చిదానంద, మేకల నారయణ, ప్రిని ్సపల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బైరెడ్డి శబరి టిడిపి పార్లమెంటు డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా ఎంపికపట్ల హర్షం - మాజీ జెడ్పీటిసి చిమ్మె బిచ్చన్న

**పగిడ్యాల, జూన్ 24, ప్రభాతవార్త :** నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి టిడిపి పార్లమెంటు డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపికకావడం పట్ల మాజీ జెడ్పీటిసి చిమ్మె బిచ్చన్నహర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రథమ మహిళగా నంద్యాల పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో డాక్టర్ బైరెడ్డి శబరి అత్యధిక మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారన్నారు. నంద్యాల పార్లమెంటుకు ఘనమైన చరిత్రవుందన్నారు. ఈ నియోజకవర్గం నుండి జనతాపార్టీ తరుపున పోటీచేసిన నీలం సంజీవరెడ్డి లోక్‌సభస్పీకర్‌గా ఎంపికైన అనంతరం రాష్ట్రపతిగా పనిచేశారన్నారు. అదేవిధంగా నంద్యాల పార్లమెంటు నుండి ఎంపికైన పివి. నరసింహారావు దేశప్రధానికిగా పనిచేశారన్నారు. ప్రత్యేకమైన గుర్తింపు ఉన్న నంద్యాల పార్లమెంటు నుండి ఎంపికైన డాక్టర్ బైరెడ్డి శబరి చరిత్రను ప్రజాభిమానంతో తిరగరాశారన్నారు. సోమవారం పార్లమెంటు సభ్యురాలుగా తెలుగులో ప్రమాణం చేసి తెలుగుదేశం పార్టీ ప్రతే ్యకను చాటిచెప్పిన బైరెడ్డి శబరి అభినందనీయురాలనీ అమెకు చిమ్మె బిచ్చన్న తోపాటు కాటం వెంకట్రామిరెడ్డి, డాక్టర్ కరీం, తలముడి మహేష్, జలాల్ ప్రత్యేక మైన శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్‌సి,బిసి హాస్టల్స్‌లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి



**ఆదోని రూరల్, జూన్ 24, ప్రభాతవార్త :** పట్టణంలోని ఎస్‌సి, బిసి సంక్షేమ హాస్టల్ ్సలో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్ అన్నారు. సోమవారం డిఎస్ఎఫ్ ఆద్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్బంగా ఉదయ్ మాట్లాడుతూ ఎస్‌సి, బిసి సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు లేక ఎంతోమంది విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్‌సి వెల్ఫేర్ ఆఫీసర్, బిసి వెల్ఫేర్ ఆఫీసర్‌లు కనీసం ఒక్కసారైనా విజిట్ చేశారా..లేదా..కేవలం సీటుకు మాత్రమే పరిమితం అవుతున్నారా..అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టణంలోని ఎస్‌సి, బిసి సంక్షేమ హాస్టల్స్‌ను విజిట్ చేసి విద్యార్థులకు తగిన న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార యక్రమంలో డిఎస్ఎఫ్ నాయకులు కిరణ్‌మోహన్, హరికృష్ణ, రవి, మనోజ్, వీరాంజనేయులు, విక్రమ్, మౌనేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

**పెద్దకడుబూరు, జూన్ 24, ప్రభాతవార్త :** ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు 60శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని సోమవారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులో మండల విద్యాధికారులు సువర్ణ సునీయం, రామ్మూర్తిలకు వినతిపత్రం అందచేశారు. ఫీజు రాయితీ విషయమై ఇప్పటికే జర్నలిస్టు రాష్ట్ర యూనియన్ నాయకులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు చదువుకునే జర్నలిస్టు పిల్లలకు 60శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని జర్నలిస్టులు కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పుల్లయ్య, ఎంసి నారాయణ, రామన్న, ఏలియాస్, మల్లికార్జున, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల,కెజీబివి,ఆదర్శ పాఠశాలల్లో సీట్లు పెంచాలి



**దేవనకొండ, జూన్ 24, ప్రభాతవార్త :** ప్రభుత్వ విద్యాసంస్థలైన గురుకుల, కెజీబివి, ఆదర్శ పాఠశాలల్లో సీట్లు పెంచాలని, మండల కేంద్రంలో మూతపడిన ప్రభుత్వ డిఎన్‌టి వసతి గృహాన్ని పున:ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్‌కుమార్ కోరారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో మండల తహాశీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే కరువు, కాటకాలతో సతమతమవుతున్న కర్నూలు జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంతమని అన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి ఉందని, ఉపాధి లభించక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని అన్నారు. ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే సందర్భంలో వారి పిల్లలను ఇంటి దగ్గరే వదిలి వెళ్తున్నారని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నా ఉండేందుకు వసతి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఒకే డిఎన్‌టి హాస్టల్ ఉంటే నిర్వహణ లోపంతో దానిని కూడా మూసివేయడం జరిగిందన్నారు. దీంతో ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించే స్థోమత లేక తల్లిదండ్రులతో పాటు పిల్లలను ఉపాధికి తీసుకెళ్తూ పిల్లలు కూడా బాల కార్మికులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే విద్యా ప్రమాణ స్థాయిలు తగ్గిపోయాయని నిరక్షరాస్యత ఎక్కువగా ఉందని అన్నారు. నిరక్షరాస్యత తగ్గించేందుకు నూతన విద్యాసంస్థలు ఏర్పాటుకు చర్యలు తీసుకోకుండ ఉన్న విద్యాసంస్థలను, వసతి గృహాలను మూసివేయడం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావున జిల్లా అధికారులు స్పందించి గురుకుల, కెజీబివి, ఆదర్శ పాఠశాలల్లో సీట్లు పెంచి బాల, బాలికల విద్యను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు, భాస్కర్, నాయకులు శశి, మహేష్, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు రెన్యువల్ చేసుకోవాలి

:-సొసైటీ సిఈఓ ఖాజాహుసేన్

**మంత్రాలయం, జూన్ 24, ప్రభాతవార్త:** మంచాల సహకార సంఘం(సొసైటీ) బ్యాంకులో ఖాతాదారులుగా రైతులందరూ రెన్యువల్ చేసుకోవాలని సిఈఓ తెర్నెకల్ ఖాజాహుసేన్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సొసైటీలో యధావిధిగా సభ్యత్వం కొనసాగాలంటే రైతుల పొలం పాస్‌బుక్, సొసైటీ అకౌంట్‌బుక్, ఆధార్‌కార్డ్, పాన్‌కార్డులు జిరాక్ ్స కాపీలతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు అందజేయాలన్నారు. రైతులు తమ ఖాతాలను రెన్యువల్ చేయనిపక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు కోల్పోతారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కంప్యూటరీకరణలో భాగంగా సభ్యతం కలిగిన రైతులందరూ వివరాలు అందజేయాలని కోరారు. వీరివెంట సిబ్బంది రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

**ఆలూరు, జూన్ 24, ప్రభాతవార్త :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలు శేఖున్‌బీ అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక కామ్రేడ్ జ్యోతిబసు భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని సంవత్సరాలు గడిచినా ఆలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించలేకపోతున్నారన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ఆలూరు ప్రాంత విద్యార్థుల తలరాతలు మారడం లేదన్నారు. అలాగే గతంలో ఇక్కడ బిఏ గ్రూప్ ఒక్కటే ఉండేదని, ఇప్పుడు కేవలం బీకామ్, జువాలజి మాత్రమే వచ్చాయన్నారు. మిగతా సబ్జెక్ట్స్ చదవాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లాలని, లేక అరకొర వసతులు కలిగిన ఆటస్థలం లేని ప్రైవేటు కళాశాలలే దిక్కు అన్నారు. ఇక్కడ నిర్మాణం జరుగకుండ, అదనపు కోర్సులు రాకుండ ప్రైవేటు యాజమాన్యం అధికారులకు తాయిలాలు అందిస్తున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇలా ఉంటే పేద విద్యార్థుల కష్టాలు తీరేదెన్నడు, ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందేదెన్నడు అని ప్రశ్నించారు. కావున వెంటనే సొంత భవనాలు నిర్మించి అదనపు కోర్సులు ఏర్పాటు చేయాలని వారు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## త్రాగునీరు సమస్యలు తీర్చండి



**ఎమ్మిగనూరు, జూన్24 ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో త్రాగునీటి సమస్యలు ఉన్నాయని ఎన్ని ప్రభుత్వాలు మారినా మాకు త్రాగునీరు అందించే నాయకులు రావాడం లేదని మునిసిపల్ కార్యలయని కాలనీ వాసులు ముట్టడి చేశారు. సిపిఎం నాయకుల ఆధ్వర్యలో మునిసిపల్ కార్యలయనికి నీటి బిందేలతో కాలనీ వాసులు చేరుకోని నిరసన తెలిపారు. ఈసందర్భంగా నాయకులు గోవిందు, బి రాముడు, అబ్దుల్లా, వి తిమ్మప్పలు మాట్లాడుతూ రోజు వారి కూలి పనులు చేసుకోని జీవితాలు గడుపుతున్న వారికి నీటి కష్టలు తప్పడంలేదని ఇటివల కాలంలో ట్రాక్టర్ ట్యాంకులతో నీటిని ప్రజలకు నీటిని అందిస్తున్నమని తెలిపినా వచ్చే ట్రాక్టర్ ద్వారా ఎవరికి సరిపోవడం లేదన్నారు, పూర్తిగా శ్వాశతంగా నీటి పరిశ్కీరాని పరిశీలించాలని లేని పక్షంలో పేద్ద ఎత్తున్న రాస్తారోకలు నిర్వహిస్తామని వారు డిమాండ్ చేశారు, ముందుగా మునిసిపల్ కమీషనర్ గంగిరేడ్డికి వినితి పత్రమును అందజేసి వారి సమస్యలు విన్నవించారు, కమిషనర్ మాట్లాడుతూ త్వరలో కాలనీలో నీటి పైపులైనను ఏర్పటు చేసే విధంగా చూస్తమన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు, కాలనీ వాసులు పాల్గోన్నారు.

## విద్యార్థులకు స్కూల్‌కిట్‌లు పంపిణి



**నంద్యాల విద్య, జూన్ 24, ప్రభాతవార్తః** గత ప్రభుత్వం నాడు నేడు అని గొప్పగా చెప్పుకుని చేసింది ఏమిలేదని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా విద్యావ్యవస్థను పూర్తిగా విఫలం చేసింది. టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండి ఫిరోజ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఠాగూర్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు కిట్‌లను పంపిణి చేశారు. కౌన్సిలర్లు చెఱుకు శ్రీదేవి, పిచ్చికే నాగార్జునతో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యకు పెద్దపీట వేస్తు విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్కూల్ భవనాలు అధునీకరించడం జరుగుతుందనా ్నరు. పాఠశాలల్లో సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. వాటిని సాధ్యమైనంతవరుకు పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. అనంతరం మధ్యాహ్నభోజన పథక నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విలేకర్ల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

**ఎమ్మిగనూరు, జూన్24 ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు నియోజిక వర్గంలో విలేకర్ల పిల్లలకు 60శాతం ఫీజు రాయితీ ప్రవేట్, కార్పోరేట్ పాఠశాలలో ఇవ్వాలని ఏపియుడబ్లూజే తాలూకా, పట్టణ అద్యక్షులు శ్రీనివాస నాయుడు, జీబి పరమేశ్వరాలు కోరారు. ఈసందర్భంగా సోమవారం స్థానిక తహాశీల్దర్ కార్యలయం నందు ఎంఈఓ ఆంజనేయులుకు వినితి పత్రమును అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జిల్లా నాయకులు ఆదేశాల మేరకు ఈకార్యక్రమాని నిర్వహిస్తున్నామని గత కొన్ని ఏళ్లలగా ప్రతి ఒక్క వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 60 శాతం ఇస్తున్నారు, విలేకర్లతో నిరంతరం ఇబ్బందులు పెడుతున్న కార్పోరేట్, ప్రవేట్ సంస్థల నుండి పూర్తి స్వేచ్ఛగా పిల్లలకు 60 శాతం రాయితీతో విద్యను అందించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 60 శాతం రాయితీతో విద్యను అందించేదుకు తనవంతు కృషి చేస్తానాని ప్రతి ఒక్కరికి నాయ్యం చేసేవిధంగా పాఠశాలల యాజమాన్యంతో చర్చిస్తామన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, నూరహ్మద్, ఎం ఈరన్న, శివ, మక్బూల్, అశోక్, బాబురాజు, సీ నాగరాజు, రవికుమార్, ఎం రాజు, అబ్దుల్లా, యల్లయ్య, తిరుమల వెంకటేష్, అరవింద్, లక్ష్మన్న, వెంకటేష్, రహిమాన్, సునిల్ కుమార్, హరి, రంగన్న, రవీంద్ర రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గోన్నారు.

## కేజీబివి, ఆదర్శ పాఠశాలల సంక్షేమ వసతి గృహాల్లో సీట్లు పెంచి బాల బాలికల విద్యను ప్రొత్సహించాలి

**కర్నూలు విద్య, జూన్ 24, ప్రభాతవార్తః** ప్రభుత్వ విద్యాసంస్థలైన గురుకుల, కేజీబివి, ఆదర్శ పాఠశాలల సంక్షేమ వసతి గృహాల్లో సీట్లు పెంచి బాల బాలికల విద్యను ప్రొత ్సహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు డి సోమన్న, ఎస్ షాబిర్ బాషలు అన్నారు. ఈసందర ్భంగా సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు మౌర్యకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా అత్యంత వెనుకబడి ప్రాంతమన్నారు. ఈజిల్లో ఉపాధిలేక ఇతర ప్రాంతాలకు వెళ్లి వారి పిల్లలను ఇంటిదగ్గరే వదిలేసిపోతున్నారన్నారు. ప్రభుత్వం విద్యాసంస్థలు నెలకొల్పాసిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న సంక్షేమ వసతి గృహాలను మూసివేయడం జరుగుతుందన్నారు. జిల్లా వున్న ప్రభుత్వ విద్యాసంస్థలైన గురుకుల, ఆదర్శ, కెజిబివి పాఠశాలలతో పాటు సంక్షేమ వసతి గృహాల్లో వాటిల్లోసీట్లను పెంచి విద్యార్థుల యొక్క ఉన్నత చదువులకు సహకరించాలనా ్నరు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీట్లు పెంచకపోతే ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంఓ అందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కోశాధికారి ఆశోక్, నాయకులు వీరేష్, ప్రభాకర్, సుశాంత్, రవిలు ఉన్నారు.

## మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరణ

**నందవరం, జూన్ 24, ప్రభాతవార్తః** నందవరం మండల విద్యాధికారి-1 (ఎంఈఓ)గా రామాంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి లాంగ్ సెలవులో వెళ్లారు. గోనెగండ్ల మండల విద్యాధికారిగా పనిచేస్తున ్న రామాంజనేయులు ఇంచార్జిగా ఎంఈఓ బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడతూ ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలను, విద్యార్థులకు బూట్లను, బ్యాగులను సజావుగా అందించామన్నారు. ఇంకా కొన్నిరావాల్సి ఉన్నాయని అవి వచ్చిన వెంటనే ప్రతి ఒక్క విద్యార్థికి అందిస్తామన్నారు. పాఠశాలలో అందించే మెను పాత లెక్కల ప్రకారమే అందిస్తామన్నారు. మెను ఎలాంటి కొత్త నిబంధనలు రాలేదని అలాంటి ఏమైనా వస్తే తక్షణమే ప్రభుత్వం యొక్క లక్ష్యాన్ని నేరవేరుస్తామన్నారు. మండలంలో నూతనంగా చేపడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ అనుమతులు లేకుండా పాత ప్రైవేట్‌స్కూల్స్‌కు రెన్యువల్ లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పిల్లలకు మూత్రశాలలు, తాగునీరుతో పాటు అన్నివసతులు కచ్చితంగా కల్పించాలని అలా చేయని పక్షంలో ఆ పాఠశాల లైసెన్స్‌లను రద్దుచేస్తామని హెచ్చరించారు.

## పాత్రికేయుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలి

**మంత్రాలయం, జూన్ 24, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలంలోని పాత్రికేయుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా విద్యను అందించాలని ఏపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు చాంద్‌భాష, తాలుకా అధ్యక్షులు జయరాజు, మండల అధ్యక్షులు భీమరాయలు అన్నారు. సోమవారం ఉచిత విద్యను అందించాలని కోరుతూ ఎంఈఓ మొయినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఈఓ ప్రత్యేక చొరవ తీసుకొని విద్యాసంస్థల అధినేతలతో మాట్లాడి పాత్రికేయుల పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి హుసేని, కోశాధికారి సాబువలి, మండల కార్యదర్శి వెంకట్, కోశాధికారి రఫి, నాగరాజు, సాగర్, రామస్వామి, కాంతం నరసింహులు, వీరేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

